
## మల్లన్న గుట్టలో .. ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



బస్వాపూర్ గ్రామం వద్ద వెలసిన మల్లన్న గుట్టలో అయ్యప్పస్వామి మాహా పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్పస్వామి దీక్షా దారులు తదితరులు

**వెల్దుర్తి ,నవంబరు 9,ప్రభాతవార్త ప్రతినిధి:** మండలంలోని బస్వాపూర్ గ్రామం వద్ద వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి మల్లన్న గుట్ట ఆలయంలో అయ్యప్ప స్వాములు భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం నాడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు...మల్లేశం గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు అయ్యప్ప ధరించిన స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి 18మెట్లను అలంకరించి మెట్టు మెట్టు కి పూలు పండ్లతో అలంక దించారు. అనంతరం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో భజనలతో గీతాలపనతో స్వామివారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## తాగునీటి సరఫరాలో అంతరాయం

**సిద్దిపేట అర్బన్, నవంబరు 9,ప్రభాతవార్త :**
సిద్దిపేట పట్టణానిక తాగునీటి సరఫరా చేసే లోయర్ జలాశయం 600 ఎంఎం డయా పైప్ లైన్ ఇల్లంతకుంట(ఎల్ఎండి) వద్ద లీకేజీ కారణంగా పట్టణ మున్సిపాలిటీలోని 18,19,20,21,36, 37 వార్డులకు ఈనెల 10న మంచి నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ ఆదివారం తెలిపారు. 600 ఎంఎం డయా పైప్ లైన్ లీకేజీలను మరమ్మత్తు చేయించిన అనంతరం తిరిగి ఈనెల 11న యధావిధిగా ఆయా వార్డులకునీటిసరఫరా జరుగుతుందని ప్రజలు సహకరించాలన్నారు.తాగునీటివృదాచేయకుండాపొదుపుగా వాడుకోవాలన్నారు.

## మొంథా తుఫాన్ నష్టం అంచనా పక్కా నివేదిక అందించాలి

### రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



**సిద్దిపేట, నవంబరు 9,ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుఫాన్ నష్టం అంచనాలను వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతుల పొలాలను సందర్శించి పక్కాగా నివేదిక తయారు చేసి ఏ ఒక్క నష్టపోయిన రైతు మిగలకుండా ప్రతి ఒక్కరిని కవర్ చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదేశించిచారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిర్ణీత నమూనాలో తుఫాన్ నష్టం అంచనా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్,ఆర్అండ్‌బి రోడ్లు ఎంత మేరకు మరమ్మతులకు గురైందనే అంశాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసి పూర్తి ఆధారాలతో నివేదిక సిద్ధం చేయాలని తాత్కాలిక మరమ్మతులు,శాశ్వత మరమ్మతులకు ఎంత వ్యయం అవుతుందో అంచనాలతో సహా వివరాలు సమర్పించాలన్నారు. విద్యుత్‌శాఖ సంబంధించి దెబ్బతిన్న పోల్స్,ట్రాన్స్‌ఫార్మర్ వివరాలు అందించాలన్నారు. నీటి పారుదలశాఖ పరిధిలో దెబ్బతిన్న చెరువులు,కాల్వలు, నీటివనరుల వివరాలు సమర్పించాలన్నారు. ఇతర నిర్మాణాలు,దెబ్బతిన్న ఇండ్ల సంఖ్య,చనిపోయిన పశువులు,గొర్రెలు,పౌల్ట్రీ తదితర వివరాలను పక్కాగా తయారు చేసి నష్టపోయిన ప్రజలకు సహాయం చేరేలా చూడాలన్నారు.

## కాంగ్రెస్ ప్రజా పాలనకు నిదర్శనం... కొల్లూరు వాసుల... హామీలను 24గంటల్లో నెరవేర్చాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రెవిన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**రామచంద్రాపురం, నవంబరు 9, ప్రభాతవార్త:** కొల్లూరు కాలనీ వాసులకు వారం రోజుల క్రితం ప్రభుత్వ పక్షాన చేసిన హామీలను 24 గంటలు తిరక్కముందే అమలు చేసి తమది ప్రజా పాలన ప్రభుత్వమని మరో మారు నిరూపించుకున్నామనని రెవిన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు కాలనీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, ఖమ్మం ఎంపి రామసహాయం రాఘుకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలతో కలిసి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కొల్లూరు 2 బిహెచ్‌కె కాలనీలో అభివృద్ధి విషయమై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, వారం రోజుల క్రితం చేసిన హామీలలో అనేకం అమలు చేశామన్నారు. కాలనీలో సన్నబియ్యం తీసుకునే లబ్ధిదారఉలకోసం రేషన్ దుకాణం, కాలనీలోకి ఆర్టీసి బస్సులు వచ్చేలా చేశామని, కాలనీ వాసుల రక్షణను దృష్టిలో పెట్టుకుని శాశ్వత పోలీసు ఠాణా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. 24 గంటల వ్యవధిలోనే తాత్కాలిక ఔట్ లెట్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసరాల కొరకు 2 అంబులెన్స్‌లను అందచేశామని, కాలనీలో స్పీడ్ బ్రేకర్లు, సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే అమలు చేస్తామని, శ్మశన వాటిక ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయన్నారు. కాలనీలో అర్హులైన పేదలందరికి గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందచేయనున్నామన్నారు.కాలనీలో దుకాణాల ఏర్పాటుకు త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. కాలనీలో మరిన్ని అభివృద్ధి పనులు సాధించుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసుకోవాలని మంత్రి కాలనీ వాసులకు సూచించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ భరత్, కాంగ్రెస్ నాయకులు చలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఇక్బాల్ రాసిన గీతం ఎంతో మందికి స్ఫూర్తి దాయకం

### సారె జహాసే అచ్ఛ హిందూస్తాన్ హమారా దేశ భక్తికి ప్రతీక



ఇక్బాల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, నవంబరు 9, ప్రభాతవార్త :** సారె జహాసే అచ్ఛ హిందూస్తాన్ హమార గీతం 140 కోట్ల భారతీయులకు స్ఫూర్తి దాయకం అని సిద్దిపేట ముస్లిం పెద్దలు అన్వర్ శరీఫ్, అబ్దుల్ హమీద్‌లు అన్నారు. గీత రచయిత అల్లమా మొహమ్మద్ ఇక్బాల్ 148వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇక్బాల్ మినార్ వద్ద అయన చిత్ర పటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్బాల్ జయంతిని ప్రపంచ ఉర్దూదినంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అల్లమా ఇక్బాల్ ఒక అద్భుతమైన కవి, రచయిత, రాజకీయనాయకుడు అని అన్నారు. ఉర్దూ ఉనికిని కాపాడటానికి ఆయన కృషి అమోఘం అన్నారు. భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. చంద్ర మండలంలో అడుగుపెట్టిన మొట్టమొదటి భారతీయుడు రాకేష్‌శర్మను అప్పటి ప్రధాని ఇందిరా గాంధీపై నుంచి భారతదేశం ఎలా కనిపిస్తుందని అడిగిన ప్రశ్నకు ఆయన జవాబు సారె జాహాసే అచ్ఛ హిందూస్తాన్ హమారా అన్న మాటాలు ఎంతో సూర్ఫినిచ్చాయన్నారు. అల్లమా ఇక్బాల్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆరిఫ్ ముజఫ్ఫర్, పాషా, జానీ,సాజిద్, కలీం పాల్గొన్నారు.

## సహకార సంఘం నిధులు పక్కదారి?

### సమాచార హక్కు పరిధిలోకి మేమేం రాం.. సమాధానం ఇవ్వని సహకార సిబ్బంది దురుసు సమాధానంతో రైతులకు బెదిరింపులు

**చిన్నశంకరంపేట,నవంబర్ 9, ప్రభాతవార్త:** అన్నదాతలకు ఎరువులు, విత్తనాలతో పాటు రుణాలను అందించి అండగా ఉండాల్సిన కొన్ని సహకార సంఘాల్లో అవినీతి పరిపాటిగా మారింది. నిధులు సొంతానికి వాడుకోవడంతో పాటు పక్కదారి పట్టించడం, రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడిన వైనం వెలుగుచూస్తోంది. ఈ విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా సమాచార హక్కు చట్టం 2015 పరిధిలో ఉంటాయని, భారత పౌరుడు కార్యాలయం గురించి ఎలాంటి సమాచారం కావాలన్నా అధికారి అతనికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. కాని మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల పరిధి చందంపేటలోని సహకార సంఘం మాత్రం సమాచార హక్కు చట్టం పరిధిలోకి రాదని సిబ్బంది కార్యాలయం దురుసుగా ప్రవర్తిస్తూ దరఖాస్తుదారునికి తెలిపారు. ధర్పల్లి గ్రామానికి చెందిన రైతు ప్రవీణ్ 18 నవంబర్ 2024లో సహకార సంఘంలో 2016 నుండి 2024 వరకు జరిగిన లావాదేవీల వివరాలను ఇవ్వాలని రైతు దరఖాస్తు చేసుకున్నాడు. కార్యాలయ సిబ్బంది సిద్ధిరాములు దరఖాస్తు తీసుకొని చైర్మన్ సత్యం, సిఈఒ పాశాకు అందించారు. దరఖాస్తులో ప్రధానంగా రైతుల వద్ద నుండి ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు, ఎంత మందికి ఎన్ని డబ్బులు వారి ఖాతాలలో జమ చేశారు. సహకార సంఘం నుండి హామాలీ డబ్బులు,గోనె సంచి కుట్టడానికి వినియోగించే సుతీల్‌తాడు రైతులకు అందించారా లేదా, ఎరువుల అమ్మకాల వివరాలను అందించాలని కోరాడు. దరఖాస్తు అందించి సంవత్సరం గడుస్తున్నా ఎటువంటి సమాచారం రాకపోవడంతో రైతు సిబ్బందిని పలుమార్లు సంప్రదించినా వారు స్పందించలేదు. సహకార సంఘం చైర్మన్ సత్యంను నిలదీయగా నేను ప్రభుత్వ అధికారిని కాదని, వెళ్లి సిఈఒ పాశాను అడగాలని దురుసుగా సమాధానం చెప్పడంతో ఆ రైతు చేసేది ఎమి లేక సీఈవో పాశాను సంప్రదించాడు. అతని నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అక్టోబర్-2025లో మరోసారి పాశాను నిలదీయగా ఎనిమిది నెలల నుండి మాకే జీతాలకు దిక్కులేదు, నీకేం సమాచారం ఇవ్వాలని దురుసుగా ప్రవర్తించాడని రైతు ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. సహకార సంఘం సభ్యులు మూకుమ్మడిగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, ఉన్నత అధికారులు స్పందించి సహకార సంఘంపై దాడులు నిర్వహిస్తే మరింత సమాచారం అందుతుందని తెలిపారు. సిఈఒ పాశాను ఈ విషయమై సంప్రదించగా సహకార సంఘాలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావని, ఏమైన వివరాలు కావాలంటే చైర్మన్‌ను అడగాలని తెలిపారు. కాని మండలంలో ఉన్న సహకార సంఘాల్లో జరిగే ఆడిట్‌లు నామమాత్రంగా జరుగుతున్నాయని విమర్శలు ఉన్నాయి.

## కార్మికుల నడ్డి విరుస్తున్న లేబర్ కోర్టులు

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు



నర్సాపూర్ లో నిర్వహించిన ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు తదితరులు

**నర్సాపూర్,నవంబరు 9, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోర్డులతో పలు పరిశ్రమలు కార్మికుల నడ్డివిసిరేలా వ్యవహరించడం సిగ్గుచేటని సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. ఆదివారం నర్సాపూర్ తూప్రాన్ ఆటో యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కడారి నాగరాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు అమలు చేయకపోను, ఇప్పుడు ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదరులకు అనుగుణంగా వ్యవహరిస్తూ లేబర్ కోర్డులు తీసుకువచ్చిందని గుర్తుచేశారు. కార్మిక సంఘాలు పోరాటాలలో ప్రధాన పాత్ర సిఐటియు పోరాటం చేయగా ఈ లేబర్ కోర్డు అమలు కాకుండా ఆపాగాలిగమని అన్నారు. ఈ మధ్యకాలంలో సంగారెడ్డి జిల్లా ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ పరిశ్రమలో యూనియన్ ఏర్పాటు చేస్తే కార్మిక చట్టలకు వ్యతిరేకంగా యాజమాన్యం కార్మికులను సస్పెండ్ చేయడం దూర్మార్గమని అన్నారు. కార్మికుల కష్టానష్టాలు, వారి హక్కుల కోసం యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు కార్మికులకు ఉన్నపటికీ యూనియన్ ఏర్పాటు చేసారనే కారణంతో యూనియన్ ప్రధాన కార్యదర్శితో పాటు 5 మందిని సస్పెండ్ చేసి మిగతా 35 మందికి నోటీసులు ఇవ్వడం బిజెపి తెచ్చిన నూతన లేబర్ కోర్డులో భాగమేనని గుర్తుచేశారు. ఇప్పటికైనా కార్మిక వర్గం కేంద్రం తెస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను ఎండకట్టడం కోసం ఐక్యం కావాలని కోరారు. మెదక్ పట్టణ కేంద్రంగా నిర్వహిస్తున్న తెలంగాణ సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు డిసెంబర్ 7,8,9 తేదీలలో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండకడుతూ భవిషత్తు ఉద్యమాలకు ఊపిరిగా ఈ మహాసభలు జరగబోతున్నాయని ఈ మహాసభలకు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఆంజనేయులు, ప్రవీణ్, అనిల్, నర్సింలు, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కొనసాగిన సార్వజనిక పాదయాత్ర



సార్వజనిక పాదయాత్ర దృశ్యం

**సదాశివపేట,నవంబరు 9 (ప్రభాతవార్త):** పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగ సమాజం ఆధ్వర్యంలో సార్వజనిక పాదయాత్రను నిర్వహించారు. లోక కళ్యాణార్థమై నిర్వహించిన ఈ పాదయాత్ర ఆదివారం నాడు ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక బసవేశ్వర మందిరం నుండి ప్రారంభమైన ఈ పాదయాత్ర పాత పేరుమాల్ల మందిరం నుండి మద్దికుంట చౌరస్తా మీదుగా తంగెడపల్లి గ్రామంలోని శ్రీ కోటి బిల్వలింగేశ్వర క్షేత్రం జంగమయ్య గుట్ట వరకు కొనసాగింది. ఆ దివ్య క్షేత్రంలో వీరశైవులంతా వన భోజనాలు చేయుటకై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సదాశివపేట నుండి మొదలైన పాదయాత్ర గమ్యం చేరుకునే వరకు ఆద్యాంతం ఆటలు పాటలతో బతుకమ్మ ఆటలతో తుల్జా భవాని భజన మండలి వారి భజనలతో కొనసాగింది. జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్ మాట్లాడుతూ మన సమాజం ఎల్లవేళలా కలిసిమెలిసి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగించాలని అన్నారు. సమాజంలోని సభ్యులందరికీ మా ఆశీర్వాదం ఎల్లవేళలా ఉంటుందని అవధూత్ మహారాజ్ బర్దిపూర్ అవధూత డాక్టర్ బసవలింగ మల్లన్న అన్నారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్, శివరాజ్ పాటిల్, కోవూరి సంగమేశ్వర్, అడికె జగదీశ్వర్,మల్లికార్జున్ పాటిల్, నాయకుడి రామన్న,జిల్లా ప్రధాన కార్యదర్శి కొంక రాజేశ్వర్, కోశాధికారి పోలీస్ సంతోష్ పాటిల్,జిల్లా సలహా దారు అనిమి శెట్టి జయప్రకాష్, సదాశివపేట బసవేశ్వర వీరశైవ సమాజం అధ్యక్షుడు గదిగా రాజు, సిద్ధన్న పాటిల్,అపర్ణ శివరాజ్ పటేల్,మల్లికార్జున్, ప్రశాంత్ పాటిల్, నవీన్,రామోజీ, పట్లోళ్ల శివ కుమార్,మహిళా అధ్యక్షురాలు పట్లోళ్ల అరుణ,కార్యదర్శి గొర్రె గట్టు శారద, లింగాయత్ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## కల్లుగీతా కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుండి కల్లుగీత కార్మికులను నిర్లక్ష్యం చేస్తుందని తెలంగాణ కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ మండిపడ్డారు. ఆదివారం రోజున మండలంలోని పందిల్ల గ్రామంలో కల్లు గీత కార్మికుల సమస్యల గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కల్లు గీత కార్మికులు తాటి చెట్టు మీద నుండి పడి చనిపోయినా, వికలాంగులైన వారికి ఎటువంటి తక్షణ పరిహారం అందడం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి గీత కార్మికులకు ఒక్క పైసా కూడా సహాయం అందించకపోవడం దురదృష్టకరమైన విషయమన్నారు. గీతా కార్మికులలో అర్హులైన వారికి కొత్త పెన్షన్‌లు కూడా మంజూరు చేయడం లేదని, ఇప్పటి వరకు పాత పెన్షన్ల పెంచలేదని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బెల్ట్ షాపులు తొలగిస్తామని హామీ ఇవ్వడంతో పాటు తెలంగాణ కల్లుగీత కార్మిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 100 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించారని మండిపడ్డారు. బలహీన వర్గాల శాఖకు మంత్రిగా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ గీతా కార్మికుల సమస్యలపై నిరక్ష య వైఖరి వహించడం బాదాకరమైన విషయమన్నారు. గీత కార్మికుల ప్రధాన సమస్యలపై ఈనెల 28వ తేదీ సూర్యాపేటలో భారీ బహిరంగ సభ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ మండల గీతా కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతా కార్మికులు పూదరి రఘుపతి, బొమ్మగాని శ్రీనివాస్, బొమ్మగాని కుమారస్వామి, గాధగోని కనకయ్య, చెర్లవరపు సంపత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధమే ప్రభుత్వ లక్ష్యం

### యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాండ్రాల దాము

**అక్కన్నపేట, నవంబరు 9, ప్రభాతవార్త :**
రాష్ట్రంలో ప్లాస్టిక్ నిషేదమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాండ్రాల దాము అన్నారు. ఆదివారం రోజున మండలంలోని గౌరవెల్లి గ్రామంలో గల రేషన్ దుకాణంలో ప్రభుత్వం ద్వార అందిస్తున్న జూటు బ్యాగులు (రేషన్ బ్యాగులు) రేషన్ డీలర్ భైరగోని రాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులలో సన్న బియ్యంతో పాటు బ్యాగులు కూడా ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. అంతేకాకుండా గడిచిన పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అర్హులందరికీ రేషన్ కార్డులు అందించిందని గుర్తు చేశారు. హుస్నాబాద్ ప్రాంతం మంత్రి పొన్నం ప్రభాకర్ సారధ్యంలో అభివృద్ధిలో దూసుకుపోతుందని, రాబోవు రోజుల్లో కూడా మరింత అభివృద్ధిని జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కిష్టయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నందారపు సంపత్, ఒగులవేణి రవి, భైరగోని శ్రీనివాస్, జంగపల్లి రాజావీరు, కుంచం కనుకయ్య, గొల్లపెల్లి సదానందం, గ్రామస్తులు మధు, తదితరులు ఉన్నారు.

## మత్తుకు బానిస అవుతున్న యువత

- -బస్టాండ్, చెరువు గట్టులను ఆశ్రయిస్తున్న యువకులు
- -18 సంవత్సరాలు లేని యువకులే గంజాయికి టార్గెట్
- -పోలీసులు అవగాహన కల్పిస్తున్నా, అరెస్టులు చేస్తున్నా మారని తీరు
- -కుటుంబాలలో మత్తులో చిచ్చు రేపుతున్న యువత



గజ్వేల్‌లో గంజాయి సేవస్తున్న యువకులను చూపుతున్న పోలీసులు (ఫైల్)

**గజ్వేల్, నవంబరు 9 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి వికృత చేష్టలు చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేని కారణంగానే మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువతకులకు అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. పోలీసులు ప్రతిరోజు వివిధ గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా యువకులు మాత్రం మత్తుకు బానిస అవుతున్నారు. కొంత మంది యువకులు జల్సాలకు అలవాటుపడి ఎక్కడి నుండో మత్తు పదార్థాలు తీసుకువచ్చి స్థానికంగా ఉన్న యువకులకు అలవాటు చేస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో యధేశ్చగా మాదకద్రవ్యాల దందాను సాగిస్తున్నట్లు తెలుస్తుంది. అడపా దడపా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు అరెస్టులు చేస్తున్నప్పటికీ ఈ వ్యసనాలు యువత మారలేకపోతున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత కాగానే కళాశాలకు వస్తున్న విద్యార్థులను, యువతను టార్గెట్ చేసి కొంత మంది జల్సా రాయుళ్లు వారికి మాదకద్రవ్యాలు విక్రయిస్తూ అలవాటుపడేలా చేస్తున్నారు. 18 సంవత్సరాలు సైతం నిండని యువకులు చదువుకునే సమయంలో సిగరెట్‌లకు, గుట్కాలకు అలవాటుపడి విచక్షణ కోల్పోతున్నారు. కుటుంబాలలో యువత తల్లిదండ్రులు చెబితే వినే తీరు లేకుండా పోయింది. చదువుసంధ్యా లేకుండా అవారాగా తిరగడంతో పాటు మాదకద్రవ్యాలు ఉచ్చులో పడి చేతికందకుండా పోతున్నారు. ఇప్పటి నుంచే యువత చెడు మార్గాన్ని ఎంచుకుంటే భవిష్యత్తులో ఏమి జరుగుతుందో అనే భయం ఏర్పడుతుంది. పిల్లలపై తల్లిదండ్రుల నిఘా కొరవడడంతో ఇష్టంవచ్చినట్లుగా బలాదూర్‌గా తిరుగుతున్నారు. గతంలో గంజాయి సేవిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక సిఐ రవికుమార్‌లు పట్టుకోగా వారిలో ఏ ఒక్కరూ 20 సంవత్సరాలు దాటిన వయస్సు లేకపోవడం విడ్డూరం. 18 నుండి 20 సంవత్సరాలలోపు యువత ఎలాంటి భయం భక్తి అనేది లేకుండా వారికి ఇష్టమైన హెయిర్ కటింగ్‌లు చేపించుకొని, కళాశాలలు, పాఠశాలలకు వెళ్ళే దారుల్లో బైకులపై అడ్డదిడ్డంగా నడుపుతూ జల్సాలకు అలవాటుపడుతున్నారు. పిల్లలకు తల్లిదండ్రులు అంటే భయం లేకుండా పోయింది. పట్టణంలో ఎక్కడ చూసినా, సినిమా హాల్స్ వద్ద చూసినా, బహిరంగ ప్రదేశాల్లో చూసినా యువత సిగరెట్స్ తాగుతూ కనిపిస్తున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టినా సైతం అడపా దడపా మాత్రమే పోలీసుల కంట్లో పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ఎన్నో ఘోరాలు చూడాల్సి వస్తుంది. యువత పెడదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని, రోడ్డుపై జల్సాలు చేస్తున్న యువకులపై పోలీసులు ఒక కంట చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

